టెస్కాబ్ చైర్మన్‌గా రవీందర్‌రావు

వైస్ చైర్మన్‌గా కొత్తకుర్మా సత్తయ్య

రవీందర్‌రావు

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ (టెస్కాబ్) నూతన చైర్మన్‌గా మార్నేని రవీందర్‌రావు, వైస్ చైర్మన్‌గా కొత్తకుర్మా సత్తయ్య ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన పాలకమండలి సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఉన్న కొండూరి రవీందర్‌రావు, మహేందర్‌రెడ్డి ఇటీవల రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వీరి ద్దరిపై అవిశ్వాస తీర్మానం పెట్టడంతో అంతకు ముందే వారు రాజీనామా చేశారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు బోర్డు మెంబర్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని మంత్రి అభినందించారు.

నల్లగొండ డీసీసీబీ చైర్మన్‌పై 20న అవిశ్వాసం

మహేందర్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, జూన్ 10 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసానికి కాంగ్రెస్ పార్టీ తెరలేపింది. ఎన్నికలకు మరో ఏడునెలలే గడువున్నా చైర్మన్ కుర్చీ కోసం ఆ పార్టీ పెద్దలు పావులు కదుపుతున్నారు. మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌తో పాటు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఇందులో కీలక వ్యవహరిస్తున్నట్టు సమాచారం. మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాసరెడ్డిని చైర్మన్ స్థానంలో కూర్చోబెట్టాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. 14 మంది డైరెక్టర్లు సంతకం చేసి జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్‌కు అందజేశారు. వెంటనే స్పందించిన అధికారి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ఈ నెల 20న గడువుగా ప్రకటించారు.

గురుకులాలతో బంధాలు బలహీనం

- ఇది సామాజిక సమస్యగా మారే ప్రమాదం
- సెమి రెసిడెన్షియల్ విధానం అమలు చేస్తాం
- సింగిల్ టీచర్ స్కూళ్లను మూసివేయం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

టీఎస్ హెచ్ఎం పోస్టులను 10 వేలకు పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీఆర్‌టీఎఫ్ ప్రతినిధులు కావలి అశోక్ కుమార్, మారెడ్డి అంజిరెడ్డి, ప్రభాకర్‌రావు, సురేశ్, ప్రణీత్‌కుమార్

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): గురుకుల విద్యాసంస్థల ద్వారా కుటుంబ సంబంధాలు బలహీనమవుతున్నట్టు ఒక స్టడీ రిపోర్టు వెల్లడించిందని, దీనిపై మరింత లోతుగా విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని సర్కారు స్కూళ్లను సెమి రెసిడెన్షియల్‌గా మార్చే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని వెల్లడించారు. విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్‌కు సమకూర్చాలన్న ప్రతిపాదన వచ్చిందని, దీనిని పరిగణనలోకి తీసుకుని సెమి రెసిడెన్షియల్ విధానాన్ని అమలుచేస్తామని వివరించారు. సోమవారం ఆయన రవీంద్రభారతిలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'ఈ మధ్య కాలంలోనే ఒక స్టడీ రిపోర్ట్ చూసిన. దానిని లోతుగా విశ్లేషించాల్సి ఉన్నది. తెలంగాణలో చాలా రెసిడెన్షియల్ స్కూల్స్ వచ్చాయి. అవి విద్యను పెంచడానికి పనికొచ్చినా, వాటిలో చిన్న వయస్సులోనే పిల్లలను చేర్చడం వల్ల తల్లిదండ్రుల మధ్య కుటుంబ సంబంధాలు బలహీనపడుతున్నాయని స్టడీ రిపోర్టు వచ్చింది. పిల్లలకు అమ్మ ఒడే ప్రథమ పాఠశాల. అమ్మ ఒడిలోనే చాలా నేర్చుకునే అవకాశం ఉంటుంది. రెసిడెన్షియల్స్ స్కూల్స్ వల్ల, పేదరికం వల్ల అమ్మ ఒడిలో చదువుకోవాల్సిన విద్యార్థులు రెసిడెన్షియల్స్ స్కూల్స్‌లో చేరుతున్నారు. కుటుంబ సంబంధాలు బలహీనమవుతున్నాయి. ఇది భవిష్యత్తులో సామాజిక సమస్యగా మారడానికి అవకాశం ఉన్నది. కాబట్టి ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రోత్సహిస్తూనే, గ్రామాల్లోనే తల్లిదండ్రుల దగ్గరే పెరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడానికి కావాల్సిన వసతులను కల్పించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది' అని చెప్పారు. ఈ సందర్భంగా సర్కారు స్కూళ్ల మూసివేతపై సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. 'కొంతకాలంగా సర్కారు స్కూళ్లు నిర్వీర్యమవుతున్నాయి. స్కూళ్లల్లో టీచర్లు లేరని విద్యార్థులు రావడంలేదు. విద్యార్థులు లేరని బడులు మూసేస్తున్నారు. ఇది కోడి ముందా? గుడ్డు ముందా? అన్నట్టుగా తయారయ్యింది. టీచర్లను నియమించకపోతే విద్యార్థులు రారు. విద్యార్థులు లేరనే నెపంతో సింగిల్ టీచర్ స్కూళ్లను మూసివేసే పరిస్థితి ఉన్నది' అని వ్యాఖ్యానించారు. కొన్ని పాఠశాలల్లో 8-9 మంది విద్యార్థులు ఉంటే 10-12 మంది టీచర్లు ఉన్నారని చెప్పారు. పిల్లలు చేరపోతే బడులు మూతబడుతాయని, పిల్లలు విద్యకు దూరమవుతారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని బడిబాటలో భాగంగా తల్లిదండ్రులకు వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సింగిల్ టీచర్ పాఠశాలలను మూసివేయొద్దని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. ప్రతి గ్రామం, తండాకు విద్యను అందించే విధంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని భరోసా ఇచ్చారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాలను పునర్నిర్మించేందుకు రూ.2 వేల కోట్లతో పనులు ప్రారంభించామని వెల్లడించారు.

విద్యపై ఖర్చులో ఎక్కువభాగం టీచర్ల జీతాలకే

- త్వరలో విద్యాకమిషన్‌ను ఏర్పాటు
- సిలబస్‌ను ఎప్పటికప్పుడు మారుస్తాం
- సింగిల్ టీచర్ స్కూళ్లను మూసివేయం
- పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ)/రవీంద్రభారతి: విద్యపై ప్రభుత్వం పెట్టే ఖర్చులో ఎక్కువ మొత్తం టీచర్ల జీతాలకే వెళ్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.80 వేలు ఖర్చు చేస్తున్నామని, ఒక్కో టీచర్‌కు రూ.60 వేల నుంచి 80 వేల వరకు జీతాలిస్తున్నామని చెప్పారు. దీనిని తాము ఖర్చుగా భావించడం లేదని, విద్యపై పెట్టే పెట్టుబడి సమాజానికి మేలు చేస్తుందని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ప్రభుత్వ బడి పిల్లలు- ప్రతిభ గల పిడుగులు' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్కారు బడిలో చదివి పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రయివేట్ పాఠశాలలతో పోటీపడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించడం ప్రభుత్వానికి గర్వకారణమని, ఇలాంటి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే బాగుండేదని, వందేమాతరం ఫౌండేషన్ తమ బాధ్యతను గుర్తు చేసిందని అన్నారు. ఎంతోమంది గొప్ప గొప్ప నాయకులు సైతం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారని చెప్పారు. ప్రధాని మోదీ, చంద్రబాబు, తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నామని చెప్పారు. ఐఎఎస్, ఐపీఎస్ అధికారుల్లో 90% మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని వివరించారు.

విద్యాకమిషన్ ఏర్పాటు చేస్తాం

మారిన పరిస్థితులకు అనుగుణంగా సిలబస్‌ను మార్చేందుకు త్వరలోనే విద్యాకమిషన్‌ను ఏర్పాటు చేస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా కమిషన్ విద్యావ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం విద్య, వ్యవసాయాన్ని ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నదని, వ్యవసాయ కమిషన్‌ను సైతం త్వరలో ఏర్పాటుచేస్తామని తెలిపారు. గ్రామీణ పాఠశాలలపై నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. సింగిల్ టీచర్ పాఠశాలలను మూసివేయబోమని స్పష్టంచేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మహిళాసంఘాలకు అప్పగిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాశ్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, కార్యదర్శి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వకుళాభరణం, చిత్రంలో సభ్యులు

కులసర్వే కోసం అభిప్రాయ సేకరణ

- మేధావుల సలహాలు, సూచనలు స్వీకరిస్తాం
- బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు

హైదరాబాద్, జూన్10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో త్వరలో చేపట్టబోయే 'సామాజిక, ఆర్థిక కుల సర్వే' కార్యాచరణ ప్రణాళికపై మేధావులు, విషయ నిపుణుల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు వెల్లడించారు. ఇందులో భాగంగా 'పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సస్ (పీసీఓసీఎస్) విషయ నిపుణులు, మేధావుల బృందంతో రాష్ట్ర బీసీ కమిషన్ సోమవారం ప్రత్యేకంగా భేటీ అయింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో నిర్దిష్టంగా కుల సర్వే కోసం కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై లిఖిత పూర్వకంగా పలు అధ్యయన పత్రాలు అందించింది. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, బీహార్‌లో నిర్వహించిన కుల సర్వేలపై చర్చించింది. సర్వే చేస్తున్నప్పుడు ఎదురైన న్యాయపర సమస్యలు, ప్రజాస్పందన, వివిధ సాంకేతిక అంశాలు, సాఫ్ట్‌వేర్ రూపకల్పన, ఇలా ఒక్కొక్కటిగా కమిషన్‌కు పీపుల్స్ కమిటీ ప్రతినిధుల బృందం సాధికారికంగా వివరించింది. ఈ సందర్భంగా వకుళాభరణం మాట్లాడుతూ కుల సర్వే కార్యాచరణ ప్రణాళిక తయారీలో భాగంగా, త్వరలోనే రాష్ట్రంలోని అన్నివర్గాలు, మేధావులు, ప్రజా, కుల సంఘాల ప్రతినిధులను ఆహ్వానిస్తామని వెల్లడించారు. వారంలోపే తేదీలను ప్రకటిస్తామని, అందరి అభిప్రాయాలు ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. బీసీ కమిషన్ సభ్యులు సీహెచ్ ఉపేంద్ర, శుభప్రద్ పటేల్, కిశోర్‌గౌడ్, సభ్య కార్యదర్శి బాలమాయదేవి, పీపుల్స్ కమిటీ ప్రతినిధులు జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ మురళీమనోహర్, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, ప్రొఫెసర్ ఐ తిరుమలి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ పద్మజాషా, ప్రొఫెసర్ నరేంద్ర బాబు, డాక్టర్ ఎస్ పృథ్వీరాజ్, దేవల్ల సమ్మయ్య, సతీశ్‌కొట్టె తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆఫీస్‌లో వాస్తు మార్పులు?

- వారం రోజుల్లో పూర్తయ్యేలా ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో వాస్తు మార్పులు మొదలైనట్టు సమాచారం. ఇంటీరియర్ డిజైన్‌తోపాటు ఫర్నిచర్‌లో కూడా మార్పులు చేర్పులు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే ఆరో అంతస్థులో పనులు ప్రారంభమైనట్టు సమాచారం. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయానికి పెద్దగా రావడం లేదని చెప్తున్నారు. ఇంట్లో లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో సమీక్షలు నిర్వహిస్తున్నారనే చర్చ జరుగుతున్నది. సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో (సీసీసీ) వ్యవసాయశాఖపై సమీక్ష నిర్వహించడమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొంటున్నారు. వారం పది రోజుల్లో సచివాలయంలో పనులు పూర్తి కావొచ్చని చెప్తున్నారు.

ఇప్పటికే అనేక మార్పులు..

సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే సంఖ్యా శాస్త్రం, వాస్తు శాస్త్రానికి అనుగుణంగా అనేక మార్పులు చేశారని చర్చ జరుగుతున్నది. రేవంత్‌రెడ్డి 9ని అదృష్ట సంఖ్యగా భావిస్తుంటారు. అందుకే కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 9కి పెంచారని గుర్తు చేస్తున్నారు. అన్ని వాహనాల నంబర్ ప్లేట్లపై 9 నంబర్ వచ్చేలా చూసుకున్నారని అంటున్నారు. వాస్తవానికి సీఎం తన కార్యాలయాన్ని సచివాలయంలో ని 9వ అంతస్థులోకి మార్చాలని భావించారట. ఈ మేరకు పలుమార్లు వెళ్లి పరిశీలించారని, అయితే సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యం కాదని చెప్పడంతో విరమించుకున్నారని చర్చ సాగుతున్నది. ఇక నలుపు రంగును సెంటిమెంట్‌గా భావిస్తుంటారని.. అందుకే కాన్వాయ్‌ని ప్రత్యేకంగా నలుపు రంగులోకి మార్పించారని చెప్పుకుంటున్నారు. వాస్తు మార్పులకు అనుగుణంగా ఇప్పటికే సచివాయలంలోకి రాకపోకల మార్గాన్ని కూడా మార్చారని అంటున్నారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచీ సచివాలయంలోకి వెళ్లేందుకు తూర్పువైపు ఉన్న ప్రధాన ద్వారాన్ని వినియోగించారు. వాస్తు మార్పుల్లో భాగంగా పశ్చిమం వైపు ఉన్న గేటు ద్వారా లోపలికి వస్తున్నారని, ఈశాన్యం వైపు ఉన్న గేటు ద్వా రా బయటికి వెళ్లిపోతున్నారని సచివాలయ వర్గాలు తెలిపాయి.

సీతక్క వర్సెస్ సురేఖ

- మేడారం జాతర నుంచీ ఇద్దరి మధ్య విభేదాలు
- వరంగల్ ధార్మిక భవన్‌పై మంత్రుల ఆధిపత్య పోరు
- లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి మార్పుపై సురేఖ అసంతృప్తి
- కాంగ్రెస్‌లో వరంగల్ మేయర్ చేరికపైనా అభ్యంతరం

వరంగల్, జూన్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నది. రాజకీయాలు, పాలనా విషయాల్లో ఇద్దరి మధ్య విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. పైచేయి సాధించేందుకు ఇద్దరూ పోటాపోటీ వ్యూహాలను అమలు చేస్తున్నారు. గతంలో మేడారం జాతర సమయంలో వీరి మధ్య మొదలైన పంచాయితీ కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి మార్పు విషయంలో తీవ్రస్థాయికి చేరింది. వరంగల్‌లోని ధార్మిక భవన్ వినియోగంపైనా ఇద్దరి మధ్య పోరు మరింత ముదిరింది. ఇప్పుడు ధార్మిక భవన్‌ను వేరే వాటి కోసం వినియోగించే ఆలోచన చేయడం సరికాదని సీతక్క వర్గీయులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ ఈవో కార్యాలయం ధార్మిక భవన్‌లో అన్ని వసతులతో ఉన్నదని, ఈ ఆఫీసును అక్కడి నుంచి తొలగించే ప్రతిపాదన సరికాదని పేర్కొంటున్నారు. ధార్మిక భవన్‌లో సమ్మక్క-సారలమ్మ ఈవో ఆఫీసును కొనసాగించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చేవరకు మేడారంలో పూజలు నిలిపివేస్తామని అక్కడి పూజారులు వారం క్రితం ప్రకటించారు. మంత్రి సీతక్క ప్రోద్బలంతోనే ఈ ప్రకటనలు వచ్చాయని కొండా సురేఖ వర్గీయులు మండిపడుతున్నారు.

జాతర, లోక్‌సభ ఎన్నికల్లోనూ విభేదాలు

ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మేడారం జాతర విషయంలోనూ ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలు పొడచూపాయి. జాతర జరిగే ప్రాంతం సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గంలో ఉండగా, ఈ జాతర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరగాలి. జాతరలో కీలకంగా వ్యవహరించాలని కొండా సురేఖ ఒకటి రెండు సమీక్షలకు వెళ్లారు. పనుల ప్రతిపాదన, వాటిని పూర్తి చేయడం, జాతర నిర్వహణలో ఏర్పాట్లపై ఇద్దరి నడుమ విభేదాలు నెలకొన్నాయి. దీంతోజాతరకు నెల ముందు నుంచే కొండా సురేఖ అటువైపు వెళ్లనేలేదు. సీఎం రేవంత్‌రెడ్డి జాతరకు వచ్చిన రోజే అక్కడకు వచ్చి వెళ్లారు. జాతర నిర్వహణ, పనుల పర్యవేక్షణ అంతా సీతక్కే చూసుకున్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ ఇన్‌చార్జిగా ఉన్న కొండా సురేఖను బాధ్యతల నుంచి తప్పించి మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ ప్రకటించింది. సీతక్క సూచనలతోనే సొంత సెగ్మెంట్ నుంచి కొండా సురేఖను దూరం పెట్టారని ఆమె వర్గీయులు ఆనాడే అసంతృప్తిని వ్యక్తం చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన మేయర్ గుండు సుధారాణిని తనకు సమాచారం లేకుండా సీతక్క ప్రమేయంతోనే కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని సురేఖ అసంతృప్తితో ఉన్నారు. దీంతో మంత్రులు సురేఖ, సీతక్క ఆధిపత్య పోరుతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అటు పాలనా యంత్రాంగం, ఇటు కాంగ్రెస్ శ్రేణులు సతమతం అవుతుండటం బహిరంగ రహస్యం.

టీపీసీసీకి త్వరలో కొత్త అధ్యక్షుడు!

- ఎంపికపై పార్టీ అధిష్ఠానం దృష్టి
- పరిశీలనలో ఉత్తమ్, భట్టి?
- బీసీ నేత వైపే సీఎం రేవంత్ మొగ్గు!
- బడ్జెట్ తర్వాతే మంత్రివర్గ విస్తరణ?

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): టీపీసీసీకి త్వరలో కొత్త అధ్యక్షుడు రాబోతున్నారు. ఈ మేరకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణ మాత్రం మరికొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. బడ్జెట్ సమావేశాల తర్వాత మంత్రివర్గ విస్తరణకు అధిష్ఠానం సముఖత వ్యక్తం చేసినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి తన రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో పార్టీ పెద్దలతో పీసీసీకి కొత్త అధ్యక్షుడు, మంత్రివర్గ విస్తరణపై చర్చించారు. మంత్రివర్గ విస్తరణ కంటే పీసీసీ అధ్యక్షుడి నియామకంపైనే అధిష్ఠానం ప్రస్తుతం దృష్టి సారించడంతో ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేకపోవచ్చని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ సాధించిన ఫలితాలపై పూర్తిస్థాయి సమీక్ష జరిపిన తర్వాత వాటి ఆధారంగా మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, అధిష్ఠానం ఆ దిశగానే ఆలోచిస్తున్నట్టు సమాచారం.

ఎంపికపై అధిష్ఠానం తర్జన భర్జన

టీపీసీసీ కొత్త అధ్యక్షుడి నియామకంపై ఆ పార్టీ అధిష్ఠానం తర్జన భర్జన పడుతున్నది. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయాన్ని మాత్రమే అడిగి తెలుసుకొని, నిర్ణయం తమకు వదిలేయాల్సిందిగా స్పష్టం చేసినట్టు తెలిసింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా దీటుగా ఎదుర్కొనే నేతకే పీసీసీ పగ్గాలు అప్పగించాలన్నది పార్టీ పెద్దల యోచనగా తెలుస్తున్నది. సీఎం, డిప్యూటీ సీఎం రెండు కీలకమైన పదవులు ఓసీ, ఎస్సీకి ఇవ్వడంతో పీసీసీ పగ్గాలు బీసీ సామాజిక వర్గాలకు ఇచ్చే అవకాశం ఉందన్నది రాష్ట్ర నాయకులు మొన్నటిదాకా అంచనా వేశారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లొచ్చిన తర్వాత ఈ పదవి తిరిగి రెడ్డి సామాజికవర్గానికి దక్కినా ఆశ్చర్యం లేదని తాజాగా కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తున్నది. పీసీసీ మాజీ అధ్యక్షుడు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేరు కూడా అధిష్ఠానం సీరియస్‌గా పరిశీలిస్తున్నట్టు ఆ వర్గాల సమాచారం. అలాగే కర్ణాటక ఫార్ములా ప్రకారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను పీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తే ఎలా ఉంటుందనే దిశగా కూడా అధిష్ఠానం ఆలోచిస్తున్నట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ నేతకు ఇవ్వాలని ప్రతిపాదన చేసినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో త్వరలో టీపీసీసీకి కొత్త అధ్యక్షుడు వచ్చే అవకాశం ఉన్నది.

ఐఐటీ, నీట్ కోచింగ్ ఇప్పించండి

- సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పించండి
- సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన వరంగల్ విద్యార్థిని భువనకృతి

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల తరహాలో సర్కారు బడుల్లోనూ ఐఐటీ జేఈఈ, నీట్ కోచింగ్ ఇప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని విద్యార్థిని భువనకృతి కోరింది. ఐదో తరగతి నుంచే ఫౌండేషన్ కోర్సులను ప్రారంభించాలని విజ్ఞప్తి చేసింది. బడులకు వచ్చేందుకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని, సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చాలని కోరింది. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో సర్కారు బడుల్లో చదివి పదో తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లాకు చెందిన భువనకృతికి సర్కారు బడుల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించింది. భువనకృతి ప్రసంగం సాగిందిలా 'మాది వరంగల్.. కృష్ణాకాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాను. మా నాన్న కార్పెంటర్‌గా పనిచేస్తారు. కూలినాలి చేసుకొంటేనే గడిచే కుటుంబం మాది. ప్రైవేట్ స్కూళ్లో 5వ తరగతి నుంచే ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ ఇస్తున్నారు. కానీ ప్రభుత్వ బడుల్లో ఇలాంటి కోచింగ్ ఇవ్వడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఐఐటీ, నీట్ కోచింగ్ ఇవ్వాలి. నాణ్యమైన విద్యకోసం పిల్లలు ఎంతో దూరం నుంచి నడుచుకుంటూ సర్కారు బడులకు వస్తున్నారు. విద్యార్థులందరికీ నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలి. వీటన్నింటిపై ప్రభుత్వం దృష్టిసారించాలి. ఉపాధ్యాయ బదిలీలతో టీచర్లు ఇతర జిల్లాలకు వెళ్లిపోతున్నారు. కొంత మంది రిటైర్మెంట్ అవుతున్నారు. ఆయా పోస్టులను ప్రభుత్వం భర్తీచేయడంలేదు. దీంతో సబ్జెక్టు టీచర్ల కొరత సమస్య వేధిస్తుంది. ఆయా పోస్టులను భర్తీచేసి సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చాలి. బట్టీ విధానం కంటే ప్రాక్టికల్‌గా చదివితేనే ప్రయోజనం. పిల్లలు అర్థం చేసుకోగలరు. నిజ జీవితంలోను ఇది ఉపయోగపడుతుంది. ఇందుకోసం సర్కారు బడుల్లో ల్యాబోరేటరీలు, గ్రంథాలయాలు మా ప్రభుత్వ బడుల్లోనూ ఏర్పాటు చేయాలి. ఇవన్నీ చాలా అవసరం. ప్రైవేట్ స్కూల్ పిల్లలు... మీది గవర్నమెంట్ స్కూలా అంటూ హేళనగా మాట్లాడారు. వాళ్లందరు వేలేత్తిచూపేలా మేమంతా 10 జీపీఏ సాధించి ఆదర్శంగా నిలుస్తున్నాం. 10 జీపీఏ సాధించినవారం దరికి ఇంటర్‌లో చదువుకునేందుకు ఫ్రీ సీటు ఇప్పించండి' అంటూ భువనకృతి సభాముఖంగా సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

బదిలీలపై నిషేధం ఎత్తివేయండి

హైదరాబాద్, జూన్10 (నమస్తే తెలంగాణ): బదిలీలపైన ఉన్న నిషేధాన్ని తొలగించి గురుకులాల్లో వెంటనే అధ్యాపకుల, ఉద్యోగుల బదిలీలను, పదోన్నతులను చేపట్టేందుకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం (టీఎస్‌డబ్ల్యూఆర్టీఈఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సంఘం అధ్యక్షుడు బాలరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనరల్, బీసీ, మైనార్టీ గురుకులాలలో 2018, 2019లో ఉద్యోగంలో చేరిన వారికి పదోన్నతులు లభించాయని, కానీ ఎస్సీ గురుకులాల్లో సిబ్బందికి ఇప్పటికీ పదోన్నతులు లేవని వెల్లడించారు. గురుకుల సంస్థలో బదిలీలను నిషేధిస్తూ గతంలో ఉత్తర్వులు జారీ చేశారని, ఫలితంగా గత ఆరేండ్లుగా బదిలీలు చేపట్టలేదని తెలిపారు. దీంతో ఏండ్ల తరబడి మారుమూల ప్రాంతాల్లోని గురుకులాల్లోనే ఉపాధ్యాయులు, ఉద్యోగులు పనిచేయాల్సి వస్తున్నదని తెలిపారు. బదిలీలకు ముందుగా కొత్తగా నియామకాలు చేపడితే మరింత నష్టపోతారని, మెరుగైన ప్రాం